సాక్షి
చిత్తూరు
సోమవారం। 26। ఆగస్టు। 2024



రేషన్ బియ్యం పట్టివేత
పదిటన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. - 8లో



మాన్యం ఆక్రమణల తొలగింపు
చౌడేపల్లె మండలంలో ఆలయ మాన్య భూముల్లో ఆక్రమణలను అధికారులు జేసీబీతో తొలగించారు. - 8లో



ఐక్యంగా ముందుకు సాగుదాం
అధికార పార్టీ నుంచి ఎన్ని కష్టాలు ఎదురైనా కలసికట్టుగా సాగుదామని వైఎస్సార్ సీపీ శ్రేణులు తీర్మానించుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు శ్రీలంక రైతుల సందర్శన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సోమ, మంగళవారాల్లో శ్రీలంక రైతులు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తారని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో ఈ నెల 26, 27 తేదీల్లో శ్రీలంక అమృత భూమి ప్రాజెక్టు తరఫున రైతులు క్షేత్రస్థాయి సందర్శన చేస్తారన్నారు. శ్రీలంక నుంచి విచ్చేస్తున్న 20 మంది రైతులు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు పరిశీలన చేస్తారని వెల్లడించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని (ప్రభుత్వ సెలవు రోజు సందర్భంగా) నేడు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

149 మంది బదిలీ ?

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో కార్పొరేట్ కార్యాలయం, సర్కిల్ పరిధిలో జీఎం నుంచి అటెండర్ స్థాయి వరకు మొత్తం 149 మంది 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసి బదిలీ జాబితాలో చేరారు. ఇందులో జీఎం 2, సీజీఎం 2, ఈఈ 9, డీఈ 14, ఏఈ 25, ఏఏఓ 9, జేఈ 10, జేఏఓ 10, ఎస్ఏ 15, జేఏ 20, రికార్డ్ సహాయకులు 6, ఎఫ్ఎం 1, అటెండర్లు 34 మంది ఉన్నారు. ఈనెల 29లోపు ఆప్షన్‌ను తెలియజేయాలని సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు ఉద్యోగులు కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సు లెటర్లు తీసుకుని బదిలీ కోసం దరఖాస్తు చేయనున్నట్లు తెలుస్తోంది.

నేడు గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కృష్ణాష్టమి నేపథ్యంలో పోలీసు శాఖ, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో స్పందన నిర్వహించడంలేదని అధికారులు పేర్కొన్నారు.

బోయకొండ కిటకిట



చౌడేపల్లె: మండలంలోని బోయకొండ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో గంగమ్మ ఆలయంలో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

జేసీగా విద్యాధరి



చిత్తూరు కలెక్టరేట్ : జాయింట్ కలెక్టర్‌గా గొబ్బిళ్ల విద్యాధరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జేసీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు గుంటూరు నగరపాలక కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆ తర్వాత జేసీగా పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్‌ను ప్రభుత్వం నియమించింది. అయితే ఆయన జేసీగా బాధ్యతలు స్వీకరించలేదు. ప్రస్తుతం జారీచేసిన ఉత్తర్వుల్లో అభిషేక్‌ను ఐటీడీఏ పీఓగానే కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు నగరపాలక కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన విద్యాధరిని నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. ఈమె జిల్లాలో మొదటి మహిళా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించనున్నారు. వైఎస్సార్ కడప జిల్లా నందలూరు మండలం గొల్లపల్లె నివాసులైన సుజాత, సుబ్బరామయ్య దంపతులకు విద్యాధరి జన్మించారు. ఐదవ ప్రయత్నంలో 2020లో 211వ ర్యాంకు సాధించిన ఆమె సివిల్స్‌కు ఎంపికయ్యారు. 2022 నుంచి 2023 వరకు నెల్లూరు జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2023లో కందుకూరు సబ్ కలెక్టర్‌గా పనిచేశారు.

నేటి నుంచి గోకులాష్టమి వేడుకలు

కార్వేటినగరం: మండలంలోని టీటీడీ అనుబంధమైన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో 26 నుంచి గోకులాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ సోమవారం స్నపన తిరుమంజనం, మంగళవారం ఉట్లోత్సవం, గోపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రాణభయంతో సేవలందించాల్సిన దుస్థితి



ప్రస్తుత సమాజంలో వెంటాడుతున్న మానవ మృగాల బారి నుంచి కాపాడుకోవాలంటే దాక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాణభయంతో సేవలందించాల్సిన దుస్థితి ఎదుర్కొంటున్నాం. కోల్‌కతాలో జరిగిన ఘటనతో అధికార యంత్రాంగం మేల్కోవాలి. వైద్యసేవలు అందిస్తున్న వారిలో 70 శాతం మంది మహిళలే. వీళ్లకి జాబ్ చార్ట్ ఉండాలి. డ్యూటీ సమయంలో రక్షణ ఉండాలి. ఒక్కోసారి 12 గంటలు, 24 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. అటువంటి వారికి ఆహారం, రక్షణ ప్రభుత్వం కల్పించాలి. ఏవైనా దాడులు జరిగితే తెలియజేయడానికి టాస్క్‌ఫోర్స్ ఫోన్ నంబర్లు ప్రతి వార్డులో ప్రదర్శించాలి. ఎటువంటి దాడులూ జరగకుండా చూడాలి.

–రోజాప్రియ, వైద్య సంఘం నాయకురాలు, చిత్తూరు




నిర్భయంగా విధులు నిర్వహించేలా...



వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చేవారి వెంట వచ్చే సహాయకులు కొన్ని సమయాల్లో అనుచితంగా ప్రవర్తించి వైద్యులను, సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తుంటారు. ఊహించని పరిణామాలను ఎదుర్కోవడం కష్టం. అలాంటి అత్యవసర పరిస్థితుల్లో భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండాలి. లేకుంటే నిర్భయంగా విధులు నిర్వర్తించలేము. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ పరిస్థితుల వల్ల ఆందోళనకు గురవుతున్నాం. వందలాది మంది రకరకాల ఆరోగ్య సమస్యలతో వస్తారు. ఒక్కొక్కరి ప్రవర్తన ఒక్కోలా ఉంటుంది. ఈ క్రమంలో భద్రత అవసరం. అత్యవసర వార్డుల వద్ద పోలీస్ భద్రతను పెంచాలి.

–లావణ్య, వైద్యురాలు, చిత్తూరు

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో డెంగీ దోమ విజృంభిస్తోంది. పారిశుధ్య లోపంతో దోమ తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంది. కనిపించిన వారిని వెంటాడి కుట్టిపడేస్తోంది. దీంతో పల్లె, పట్టణం తేడా లేకుండా డెంగీ కేసులు నమోదవడం చూస్తే భయాందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా జీహెచ్ఎంసీ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. లెక్కలోకి రాని డెంగీ కేసులు ఎక్కువగానే ఉన్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందడం లేదు. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవుట్, ఇన్ పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది.




▸▸ చిత్తూరు నగరం 1వ డివిజన్‌లో షర్మిల (11) గత నెల జ్వరం బారిన పడింది. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన ఆ బాలికను డాక్టర్లు పరీక్షించి డెంగీగానిర్ధారించారు. తల్లిదండ్రులు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఈ నెల 2న ఆ పాప చనిపోయింది. డెంగీతో చనిపోయిందని పత్రికల్లో వార్తలు రావడంతో అది అవాస్తమని అధికారులు ప్రకటన ఇచ్చారు. ఆ బిడ్డకు పలు రకాల అనారోగ్య సమస్యలు ఉన్నాయని, అందుకే మరణించిందని చెప్పుకొచ్చారు.

▸▸ చిత్తూరు మండలంలో ఒకే గ్రామంలో నెల వ్యవధిలోనే 4 డెంగీ కేసులు నమోదయ్యాయి. కేసులు నమోదైన వారిలో అందరూ 5 నుంచి 10 ఏళ్లలోపు వారే. వీరిలో 7 ఏళ్ల బాలికను చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో వేలూరుకు తీసుకెళ్లారు. ఆ తర్వాత బిడ్డ కోలుకుంది. ఈ దెబ్బతో గ్రామంలో ఫాగింగ్ చేపట్టి బ్లీచింగ్ చల్లారు.

▸▸ చిత్తూరు నగరంలోని అశోక్‌పురంలో 12 ఏళ్ల బాలికకు జ్వరం రావడంతో ఈనెల 16న ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరీక్షలు చేశారు. అందులో డెంగీ పాజిటివ్‌గా వచ్చింది. వెంటనే ఆ పాపను అడ్మిట్‌లో ఉంచి చికిత్స అందించారు. అధికారులు పరిశుభ్రత పనులు చేపట్టారు. ఇలాంటి కేసులు రెండు జిల్లాల వ్యాప్తంగా అధిక సంఖ్యలో నమోదవుతున్నాయి.

దోమ కుట్టేస్తోంది..!



కాణిపాకం: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో డెంగీతో పాటు జ్వరం పట్టిపీడిస్తోంది. చిత్తూరు జిల్లాలో చిత్తూరు అర్బన్, రూరల్‌మండలం, పలమనేరు, పుంగనూరు, నగరి, జీడీనెల్లూరు, తిరుపతి జిల్లాలో తిరుపతి అర్బన్, రూరల్, శ్రీకాళహస్తి, రేణిగుంట, కేవీబీపురం, పుత్తూరు, గూడూరు తదితర ప్రాంతాల్లో ఈ డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు సమస్యలు జనాన్ని వెంటాడుతున్నాయి. వృద్ధులు జ్వరాల నుంచి బయటపడటం లేదు. దోమ కాటువల్లే రోగాలు, సీజనల్ వ్యాధులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే డెంగీ దోమలు వృద్ధి చెందుతాయని, అపరిశుభ్ర వాతావరణంతోనే రోగాలు వస్తున్నాయని అంటున్నారు. ఇదిలా ఉంటే రెండు జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 426 డెంగీ కేసులు నమోదయ్యాయి.

డెంగీ కేసుల వివరాలు

నెల	చిత్తూరు	తిరుపతి
జనవరి	27	77
ఫిబ్రవరి	6	37
మార్చి	14	28
ఏప్రిల్	12	21
మే	6	14
జూన్	19	28
జూలై	53	14
ఆగస్టు	51	19

లోపిస్తున్న పారిశుధ్యం

గ్రామాలు, పట్టణాల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయక దోమలు పెరుగుతున్నాయి. నిల్వ ఉన్న నీటిలో లార్వా వృద్ధి చెందుతోంది. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి నీటి గుంతలతో పాటు మురుగు కాల్వలు, పగిలిన కుండలు, తొట్టెలు, డ్రమ్ముల్లో నీటిని తొలగించాల్సి ఉన్నా ఇది పక్కాగా అమలు కావడం లేదు. నిల్వ నీటి కారణంగానే దోమలు పెరుగుతున్నాయి. అధికారులు పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు తప్పితే విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.

ఫాగింగ్ కరువు

డెంగీ వచ్చేందుకు కారకాలైన దోమల నివారణకు మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ఫాగింగ్ చేయడం లేదు. గత ప్రభుత్వం పంచాయతీల వారీగా ఫాగింగ్ యంత్రాలను అందించిన వాటిని వినియోగించడంలేదు. భద్రంగా దాచిపెట్టి దోమలను పెంచి పోషిస్తున్నారు. ఒక్కసారి గ్రామంలో ఫాగింగ్ చేయాలంటే కనీసం రూ. 5వేల నుంచి 10వేలు ఖర్చవుతుంది. నిధుల లేమి కారణంగా ఫాగింగ్ చేయడంలేదని తెలుస్తోంది. ఇక పారిశుధ్య పనులు 15 రోజులకోసారి చేపట్టాల్సి ఉండగా అధికారులు పట్టించుకోవడం లేదు.

రోగుల జేబులు గుల్ల

కొందరు జ్వర బాధితులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. కార్పొరేట్, పెద్ద పెద్ద ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ చికిత్సకు ఒక్కో రోగి నుంచి చికిత్స పేరుతో రూ.20వేల నుంచి రూ. 80వేల వరకు దోచేస్తున్నారు. ప్లేట్‌లెట్లు తగ్గాయని, వాటిని ఎక్కించాలని రోగుల జేబును గుల్ల చేస్తున్నారు. సాధారణ జ్వరంతో వెళ్లినా ఐసీయూలో ఉంచి చికిత్స చేసి వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారు. అనవసరంగా పరీక్షలు చేయిస్తూ, ప్రజలను పట్టిపీడిస్తున్నారు.

“ నిబంధనలు పాటించాలి



పరీక్షల్లో డెంగీ ఉందని తేలితే నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే చికిత్స తీసుకోవాలి. డెంగీ వచ్చిన వారు రోగ నిరోధక శక్తిని పెంచే పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రాక్ష, కివీ, దానిమ్మ, నారింజ పండ్లను తీసుకుంటే డెంగీ నుంచి త్వరగా కోలుకోవచ్చు. రెండు, మూడు రకాల కూరగాయలను గ్రైండ్ చేసి వాటి రసం తీసుకుంటే సహజ పోషకాలు లభిస్తాయి.

–శ్రీహరి, డీఎంహెచ్ఓ, తిరుపతి

తగు జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాలు కురుస్తున్నందున రోగాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలి. ముందస్తు జాగ్రత్తలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స పొందాలి. పరిశుభ్రమైన వేడి ఆహారాన్నే భుజించాలి.

–ప్రభావతిదేవి, డీఎంహెచ్ఓ, చిత్తూరు

జాగ్రత్తలు తీసుకోవాలి



- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- వారంలో ఒక రోజును డ్రైడేగా పాటించి నీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలి.
- పాత టైర్లు, నీటి ట్యాంకులు, పూల తొట్టెల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- దోమతెరలు, మస్కిటో కాయిల్స్‌ను వినియోగించాలి.
- వాననీటి గుంతల్లో ఆయిల్ బాల్స్‌ను వేయాలి.
- మురుగు నీరు నిల్వ ఉండకుండా, పారిశుధ్యం లోపించకుండా చూసుకోవాలి.
- మరుగుదొడ్ల ఎయిర్ పైపులకు జాలీ, లేదా పలుచని వస్త్రం కట్టాలి.

డెంగీ లక్షణాలు



- డెంగీ సోకితే కళ్లలో నొప్పి, శరీరంపై దద్దుర్లు రావడం, వాంతులు, విరేచనాలు, చిగుళ్లు, ముక్కు నుంచి రక్తస్రావం అవుతుంటుంది.
- తెల్ల రక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. తీవ్ర జ్వరం వస్తుంది. అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులు వస్తాయి. జ్వరం తగ్గినట్లే అనిపించి వారం, పది రోజుల్లో మళ్లీ వస్తుంటుంది.
- తెల్ల రక్తకణాల సంఖ్య 30వేల దిగువకు పడిపోతే ప్రాణానికే ముప్పు.
- ఈ లక్షణాలుంటే వెంటనే చికిత్స తీసుకోవాలి.
- సాధారణంగా ఎడిస్ ఈజిప్ట్ దోమ కుట్టిన తర్వాత ఐదు నుంచి ఏడు రోజుల్లో డెంగీ లక్షణాలు కనపడతాయి.
- డెంగీ సాధారణ జ్వరంలా రావచ్చు.
- తీవ్ర రక్తస్రావం అయి ప్రాణాంతకం కావచ్చు.
- మెదడు వంటి ఇతర అవయవాలపై ప్రభావం చూపి మరణానికి కూడా దారితీసే ప్రమాదం ఉంది.
- జ్వరం బాగా వచ్చిన వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- రెండు రోజుల కన్నా ఎక్కువ సమయం జ్వరం ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి.

నివారణ ఇలా..



- దోమలు వృద్ధి చెందకుండా పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలి.
- నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- నీటిపై దోమల మందు చల్లించాలి. ఫాగింగ్ చేయించాలి. నీటి కంటైనర్లకు, ఆహార పదార్థాలకు ఎల్లప్పుడూ మూతలు పెట్టాలి.
- దోమ తెరలు వాడడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించడం, ఓడోమాస్ వంటి క్రీములు పూసుకోవడం చేయాలి.

కిక్కిరిసిన కాణిపాకం



కాణిపాకం ఆలయంలో భక్తులతో కిక్కిరిసిన క్యూలు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయంలోని క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేశారు. గర్భిణులకు, దివ్యాంగులకు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక క్యూల ద్వారా దర్శనాలు ఏర్పాటు చేశారు.

కృష్ణాష్టమి వేడుకలు రేపు

వినాయకస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఈవో వాణి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు గోపూజ జరుగుతుందన్నారు. భక్తులు ఈ పూజలో ఉచితంగా పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

స్వయం సహాయక సంఘాలు బలోపేతం



మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు కలెక్టరేట్ : స్వయం సహాయక సంఘాలు బలోపేతం అయ్యేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన లక్‌పత్ దీదీ పథకాన్ని ఆదివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. పీడీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి సభ్యురాలు లక్షాధికారి కావాలన్నదే లక్‌పత్ దీదీ పథకం ఆశయమన్నారు. ఈ పథకం జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టామన్నారు. మహిళలు జీవనోపాధిని పెంచుకునేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని వ్యాపార కార్యక్రమాలతో జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవాలని కోరారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాల అమలుకు వంద రోజుల ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. లక్‌పత్ దీదీ పథకంలో జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ స్త్రీ నిధి, ఉన్నతి రుణాలతో 5,758 మంది సభ్యులకు రూ.117.30 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం మెగా చెక్కును స్వయం సహాయక గ్రూపు సభ్యుల మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం హరీష్, డీపీఎంలు రవికుమార్, ప్రకాష్, ఏపీఎంలు సూరి, జ్యోతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు రెండు నగర వనాలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో రెండు నగర వనాలను నిర్మించడానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు నగరంలోని అమూల్ డెయిరీ వద్ద నెహ్రూనగర్ అటవీ ప్రాంతంలో, పూతలపట్టు –పెనుమూరు సరిహద్దులోని కలిగిరి కొండ సమీపంలో నిర్మించనున్నట్లు చెప్పారు. మొత్తం 50 హెక్టార్లలో నిర్మించనున్న ఒక్కొక్క నగరవనానికి రూ.2 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

నాటుతుపాకీ స్వాధీనం : ఇద్దరు అరెస్టు



నిందితుల్ని అరెస్ట్ చేసిన ఏఎస్ఐ త్యాగరాజన్

బైరెడ్డిపల్లె : వేటకెళ్లి తిరిగి వస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, నాటుతుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ త్యాగరాజన్ తెలిపారు. మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందిన లతీఫ్ కుమారుడు ఫయాజ్, రజాక్ కుమారుడు నయాజ్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటకెళ్లారు. పోలీసులకు సమాచారం రావడంతో రామసముద్రం గ్రామ సమీపంలోని క్వారీ వద్ద గాలింపు చర్యలు చేపట్టడంతో అదే రహదారిలో నాటుతుపాకీతో వస్తున్న ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

నగలు, నగదు చోరీ



చిందరవందరగా ఉన్న బీరువా

రామకుప్పం: తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు బద్దలుకొట్టి ప్రవేశించిన దొంగలు నగలు, నగదు దోచుకున్న సంఘటన ఆదివారం మండలంలో వెలుగు చూసింది. బాధితుల కథనం మేరకు, కుప్పం–పలమనేరు జాతీయ రహదారి పక్కన చెల్దిగానిపల్లిలో ఉంటున్న దేవేంద్ర కుటుంబం శనివారం బెంగళూరుకు వెళ్లింది. ఆదివారం సాయంత్రం వారు ఇంటికి వచ్చేసరికి తలుపులు బద్దలైపోయి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువా తలుపులు తెరిచి అందులోని 82 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.30 కిలోల వెండి, రూ.20 వేల నగదు దొంగిలించినట్టు గుర్తించారు. దీనిపై బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

అక్రమ టపాకాయల నిల్వ సీజ్

పలమనేరు: పట్టణ ఆవాసాల మధ్య ఎలాంటి అనుమతులు లేకుండా టపాకాయలు నిల్వ ఉంచిన గోడౌన్లపై స్థానిక పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. వెంకటేష్‌కు చెందిన రూ.20వేలు, ఆరీఫ్‌కు చెందిన రూ.14వేలు విలువచేసే టపాకాయలను వారు సీజ్‌చేశారు. ఇందుకు కారణమైన వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు అర్బన్ సీఐ నరసింహరాజు తెలిపారు.

రాత్రి గస్తీ ముఖ్యం



ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీస్ ఔట్ పోస్టు ఆవశ్యకత ఎంతైనా ఉంది. యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టాలి. సమస్యలు ఎదురైనప్పుడు మాత్రమే ఈ ప్రస్తావన వస్తుంది. ఆపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. జిల్లా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మహిళా వైద్యులు, నర్సింగ్ స్టాఫ్‌తోపాటు నర్సింగ్ విద్యార్థినులు రాత్రీ పగలు సేవలు అందిస్తుంటారు. వారికి భద్రత అవసరం. గైనిక్, సర్జరీ, చిన్న పిల్లల, మహిళా వార్డుల వద్ద భద్రత ప్రమాణాలతో కూడిన రక్షణ సిబ్బంది అవసరం. బాధితులతో వచ్చే సహాయకులు నిబంధనల మేరకు మాత్రమే వ్యవహరించాలి. నిర్భయంగా ఉన్నప్పుడు బాధ్యతతో కూడిన మెరుగైన వైద్యులు సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

-జయప్రియ, వైద్యులు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



నైట్ డ్యూటీ వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాయిత్యం సభ్య సమాజానికి సిగ్గుచేటు. మగవారితో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రాణాలు నిలిపే వైద్యరంగంలో మహిళల సేవలు అమూల్యమైనవి. ఇటువంటి వైద్యరంగంలో రాత్రి విధులు నిర్వర్తించే వైద్యురాలిపై హత్యాచారం అత్యంత అమానుషం. అన్ని రంగాల్లోని మహిళలకూ రక్షణ కల్పించాలి. జిల్లా ఆస్పత్రి, పీహెచ్‌సీ, ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, నర్సులు, ఇతర ఇబ్బంది రక్షణకు ప్రాధాన్యమివ్వాలి. ఒక్కో సందర్భంలో మద్యం మత్తులో ఉండే పోకిరీలతో నైట్ డ్యూటీల్లో ఉండే వైద్యులు, హెడ్ నర్సులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆస్పత్రులు, సెక్యూరిటీ సిబ్బందిని సంఖ్యను పెంచాలి.

-స్వాతి, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

అపరిచితుల అపహరణ 'పాత్ర'

ఐరాల మండలంలో ఒంటిరి ఇళ్లను జల్లెడ పెట్టిన మహిళ.. ఊరికి చివరగా ఉన్న ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఉన్న మహిళను లౌక్యంగా మాటల్లోకి దింపింది. తనకు చిన్నపాటి అనారోగ్య సమస్యలున్నాయని ఇంట్లో ఉన్న మహిళ చెప్పడంతో .. ఓ ఇద్దరు వ్యక్తులు తెల్లటి వస్త్రాలు ధరించి తిరుగుతుంటారు. వాళ్లను ఇంట్లోకి పిలిచి పూజలు చేసుకో, నీకు సంపూర్ణ ఆరోగ్యం ప్రాప్తిస్తుందని చెప్పి మహిళ వెళ్లిపోయింది. కొద్దిసేపటి తరువాత తెల్లటి దుస్తులు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఇంటి బయట తిరుగుతుండడం, మహిళ వాళ్లను పిలిచి పూజలు చేయమని చెప్పింది. చివరగా ఇంట్లో ఉన్న బంగారు నగలన్నీ ఓ పాత్రలో పెట్టాలని, తాము వెళ్లిన తరువాత పాత్ర తెరచి చూస్తే బంగారం మెరిసిపోవడంతో పాటు ఆరోగ్యం కుదుటపడుతుందని వెళ్లిపోయారు. తీరా పాత్ర తెరచి చూస్తే రాళ్లు తప్ప మరేమీ కనిపించకపోవడంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది.

పలమనేరు నియోజకవర్గంలోని ఓ శివారు గ్రామంలో ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు ఊరూరా తిరుగుతూ పాత బంగారం, వెండి వస్తువులకు మెరుగులు వేస్తామని అరుస్తూ కనిపించారు. ఇంట్లో నల్లబడిన వెండిని టౌన్‌ను తీసుకెళ్లి మెరుగు పెట్టించుకునే సమయంలేక.. బయట అరుస్తున్న వాళ్ల చేతిలో పెట్టి, మెరుగు పెట్టాలని మహిళ చెప్పింది. మెరుగు పెట్టినట్లు నటించి, ఓ డబ్బాలో వెండికి బదులు గులక రాళ్లు ఉంచి.. తాము వెళ్లాక దీన్ని చూసుకోవాలని నిందితులు పారిపోయారు.

- ఆభరణాల మెరుగు పేరిట బురిడీ
- బంగారు, వెండి ఆభరణాలతో పరారీ
- ఆరోగ్యం కోసం పూజలంటూ వంచన
- జిల్లాలోకి దిగిన మోసాల ముఠా.. తస్మాత్ జాగ్రత్త




ఐరాలలో బంగారు ఆభరణాల స్థానంలో గులకరాళ్లు ఉంచి పారిపోయిన నిందితులు

చిత్తూరు అర్బన్: ప్రస్తుతం జిల్లాలో ఈ తరహా మోసాలు పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్నాయి. అమాయకులైన మహిళలు, సామాన్యుల మూఢ నమ్మకాలే పెట్టుబడిగా మోసాలకు పాల్పడే ముఠా జిల్లాలో తిరుగుతోంది. ప్రధానంగా పల్లెటూర్లలోకి దిగుతున్న నలుగురు కంటే ఎక్కువ సభ్యులున్న ఓ ముఠా, శాస్త్రం చెబుతామని నమ్మించి ఊరి చివరల్లో ఒంటరిగా ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుంటోంది. ముందుగానే మాట్లాడుకున్నట్టుగా తమ ముఠాకు చెందిన మహిళను పంపడం, నిర్మానుష్య ప్రదేశంలో ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకునే ఎత్తుగడ వేస్తున్నారు. ఇంట్లో ఉన్న మహిళను మాటల్లోకి దించి, అనారోగ్యం పేరిట, ఇంట్లో అతీతమైన బంగారం ఉందని చెప్పడం, పూజలు చేస్తే కొత్త శక్తులు ఇంటికి వస్తాయని రకరకాల మాటలు చెప్పి వెళ్లిపోతుంటారు. ఆపై ముఠాలోని ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇంటి బయట నిలబడి, ముందుగా తమ ముఠాకు చెందిన మహిళ చెప్పిన కొన్ని మాటల్ని నమ్మేట్టు చెప్పి.. పూజలోకి దింపుతున్నారు. ఆపై ఇంట్లోని విలువైన బంగారు, వెండి ఆభరణాలతో ఉడాయిస్తున్నారు. గుంటూరు, ఒడిశా సరిహద్దు ప్రాంతాలకు చెందిన ముఠాలు జిల్లాలో తిరుగుతూ ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

అప్రమత్తత అవసరం

అపరిచిత వ్యక్తులను ఇంట్లోకి రానివ్వడం, ఇంటి బయట వాళ్లతో అనవసరమైన మాటలు పెట్టుకోవడం వల్లే విలువైన వస్తువుల అపహరణకు దారి కల్పించినట్లు అవుతోంది. కొందరు మంత్రాలు, తాంత్రిక శక్తుల పేర్లు చెప్పి పూజలు చేయాలని సూచిస్తుంటారు. ప్రజల మూఢ విశ్వాసాలు, లాజిక్‌తో ఆలోచించే శక్తి లేకపోవడంతో కష్టార్జితాన్ని దొంగలపాలు చేసినట్లవుతోంది. బంగారు ఆభరణాలను బియ్యం డబ్బాలో పెట్టి కళ్లు మూసుకుని మంత్రం జపించాలని చెప్పి, ఆభరణాలు ఉన్న డబ్బా స్థానంలో గులకరాళ్లు ఉన్న పెట్టెను పెట్టి పారిపోతున్నారనే విషయాన్ని గ్రహించాలి. ఇక బంగారు, వెండి ఆభరణాలు మెరుగు పెట్టుకోవాలంటే తెలిసిన వాళ్ల దగ్గరైనా, లేక నగల దుకాణాల్లో చేసుకోవడం మంచిది. అపుడు కూడా ముందుగా మనం ఇస్తున్న ఆభరణాల బరువును తూకం వేయించి, ఆపై శుద్ధి చేసిన తరువాత తూకాన్ని సరిచేసుకోవడం తప్పనిసరి. అంతేకానీ ఊర్లోకి వచ్చే వాళ్ల వద్ద చేసుకోకూడదు. ప్రధానంగా ఇళ్ల వద్ద ఒంటరిగా ఉంటున్న మహిళలు ముందస్తుగా ఇంలాం

వెంటనే ఫిర్యాదు చేయండి



ఇపుడంతా మోసాలు ఎలా జరుగుతున్నాయో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్‌లలో బాగానే చూపిస్తున్నారు. అసలు అపరిచితులతో ఎలాంటి మాటలు పెట్టుకోవద్దు. ఒకవేళ మోసం జరగబోతోందని ముందుగా తెలిసినా, మోసానికి గురై నగలు పోగొట్టుకున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. ఇంట్లో తెలిస్తే ఏమవుతుందో, బయటివాళ్లు ఎమనుకుంటారో అనే ఆలోచన వద్దు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్ల దొంగల్ని పట్టుకోవడం మాకు సాధ్యమవుతుంది. ఆలస్యం చేస్తే మొదటికే మోసం వస్తుంది. ప్రజలు మోసాలకు గురైనా, ఇబ్బందులు కలిగినా డయల్-100, 112, పోలీసు వాట్సప్-9440900005 నెంబర్లకు సమాచారం ఇవ్వండి.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు.

ఐక్యంగా ముందుకు సాగుదాం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ యువత, కార్యకర్తలు


శాంతిపురం: పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉంటూ అధికార పార్టీ వేధింపులను సమష్టిగా ఎదుర్కోవాలని వైఎస్సార్ సీపీ యువత ఆత్మీయ సమావేశంలో వక్తలు చెప్పారు. స్థానిక ఎస్ఎల్‌వీ కల్యాణ మంటపంలో ఆదివారం పార్టీ యువకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. వాట్సాప్ గ్రూపు ద్వారా సమాచారం పంచుకుని దాదాపు 100 మంది హాజరయ్యారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తాము ఎదుర్కొన్న చేదు అనుభవాలను కార్యకర్తలు పంచుకున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా జగనన్న వెంటే నడుస్తామన్నారు. అధికార పార్టీ దాడులు, తప్పుడు కేసులు ఎదురైన సమయంలో పరస్పరం తోడుగా నిలవాలని తీర్మానించుకున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు క్రమశిక్షణతో నడుచుకుంటామని చెప్పారు.

పోలీసుల జోక్యం

సమావేశం జరుగుతున్న కల్యాణ మంటపానికి వచ్చిన రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ ముందస్తు అనుమతులు లేకుండా పార్టీ సమావేశాలు నిర్వహించరాదని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఐదు నిమిషాల్లో సమావేశం ముగించి అందరూ వెళ్లిపోవాలని ఆదేశించారు. దీంతో అర్థంతరంగా సమావేశం ముగించి వైఎస్సార్‌సీపీ అభిమానులు వెనుదిరిగారు.

రేషన్ బియ్యం పట్టివేత

- పదిటన్నుల బియ్యం స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు



వాహనంలోని రేషన్ బియ్యం బస్తాలు

పలమనేరు: పలమనేరు పట్టణం సమీపంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని నాగమంగళం వద్ద రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్టు సీఐ నరసింహరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తవణంపల్లి మండలం నుంచి కర్ణాటకకు బియ్యం అక్రమంగా రవాణా అవుతోందని అందిన సమాచారం మేరకు ఎస్పీ అధికారులు అప్రమత్తమయ్యారు. నాగమంగళం వద్ద నిఘా పెట్టి బంగారుపేట వైపు వెళుతున్న టెంపోను పరిశీలించారు. అందులో ఉన్న రూ.3 లక్షల విలువైన పది టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనం డ్రైవర్ ధనశేఖర్, క్లీనర్ మనోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన స్మగ్లర్ కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. మరోవైపు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో తవణంపల్లి మండలానికి చెందిన కిరణ్‌కుమార్ ఇంటి వద్ద పోలీసులు దాడులు చేశారు. అక్కడున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి టాటాబోలోరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని వెనుకనున్న ముఠాను త్వరలో పట్టుకుంటామని సీఐ నరసింహరాజు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 79,521 మంది స్వామిని దర్శించుకున్నారు. 40,152 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.87 కోట్లు సమర్పించారు. టైం స్లాట్, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ సతీష్ కృపాకరన్

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు మరో వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు, వేలూరులోని విరుదంబట్టుకు చెందిన సతీష్ కృపాకరన్(43), సుదర్శన్(37) వేలూరు నుంచి చిత్తూరుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై కిల్లారిపల్లె వద్ద ఎదురుగా కుక్క రావడంతో హఠాత్తుగా బ్రేక్ వేయడంతో రోడ్డు వద్ద సూచికబోర్డును ఢీ కొన్నారు. వీరిద్దరూ వేలూరు సీఎంసీలో పనిచేస్తున్నారు. ఇందులో సతీష్ కృపాకరన్‌కు తీవ్రగాయాలయ్యాయి. సుదర్శన్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. వెంటనే 108 సిబ్బంది శివకుమార్, సతీష్ ప్రథమ చికిత్స అందించి చీలాపల్లె సీఎంసీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యూపీఎస్ కాదు ఓపీఎస్ కావాలి



నమోదు పత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : యూపీఎస్(యునైటెడ్ పెన్షన్ సిస్టమ్) కాదు ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) కావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ఉద్యోగులకు యూపీఎస్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేకుండా ఇచ్చే దానినే పెన్షన్ అంటారని తెలిపారు. అంతేకాని ఉద్యోగి నుంచి చందా వసూలు చేసి అతను రిటైర్ అయ్యాక ఇచ్చే దాన్ని పెన్షన్ అనరని ఆరోపించారు. జిల్లా అధ్యక్షులు సోమశేఖరనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు పత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మణిగండన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, రెహనబేగం, దక్షిణామూర్తి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత రోడ్డు ప్రమాదం కేసులో

ఎన్నో అనుమానాలు?

- ఫిర్యాది బడా వ్యాపారి కావడంతో పలువురితో విరోధాలా!
- ఇది శత్రువుల పనేనా లేక బియ్యం స్మగ్లర్ల హస్తముందా?

పలమనేరు: నియోజకవర్గంలోని గంగవరం మండలం నాలుగురోడ్ల వద్ద వారం క్రితం లక్కనపల్లెకు చెందిన టీడీపీ నేత రఘుచంద్రగుప్త కారును ఈచర్ ఢీ కొంది. ఈ సంఘటనకు సంబంధించి పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇప్పటికే ఈ కేసులో వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్కనపల్లి శ్రీనివాసులు రెడ్డితో పాటు మరో నలుగురిపై గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. అయితే బాధితుడు బడా వ్యాపారి కావడంతో ఆయనకు ఇతర శత్రువులెవరైనా ఈ ఘటనకు పాల్పడ్డారా లేక రాజకీయ కోణంలో కేసు నమోదైందా అనే విషయంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసుల దర్యాప్తు ఇది

సోమవారం రాత్రి రఘుచంద్రగుప్త అరుణాచలం నుంచి కారులో స్వగ్రామానికి వస్తుండగా గంగవరం మండలం నాలుగురోడ్ల వద్ద కర్ణాటకకు చెందిన ఓ ఈచర్ వాహనం ఇతని కారును ఢీకొంది. కారు దెబ్బతిన్నప్పటికీ ప్రాణాలతో రఘుచంద్రగుప్త బయటపడ్డారు. తనపై ఎవరో హత్యాయత్నం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఫోన్‌నంబర్లు, సెల్ టవర్ డంప్ ఆధారంగా వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులు రెడ్డి, కర్ణాటక రాష్ట్రం కోలారు రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ పార్టీలో పనిచేసే వినాయకం, డ్రైవర్ అస్లాం, మునెప్ప, శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. శ్రీనివాసులు రెడ్డి సుపారీ ఇవ్వడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.

కానీ ఇందులో అనుమానాలు ఇవి

లక్కనపల్లికి చెందిన పప్పు వ్యాపారి రఘుచంద్ర గుప్తా టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతున్నారు. గతంలో ఇదే గ్రామానికి చెందిన వీఆర్వో వీకోట వద్ద రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై బాధిత కుటుంబీకులకు ఇప్పటికీ అనుమానాలున్నాయి. ప్రస్తుతం ఆ వీఆర్వో కుటుంబం బెంగళూరులోనే ఉంటోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కర్ణాటకకు ఇక్కడి నుంచి బియ్యం తరలించే అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. వీరిలో కొందరు బాధితుడి ప్రాంతానికి చెందిన వారు, ఆయనకు పరిచయం ఉన్నవారేనని తెలిసింది. గతంలో వారు అధికారులకు మామూళ్లు ఇచ్చుకుంటూ ఈ వ్యాపారాన్ని సాగించేవారు. కానీ ఇప్పుడు ఈ అక్రమాలన్నీ పచ్చనేతల కనుసన్నల్లోనే సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బియ్యం స్మగ్లర్లు ఇతనిపై కక్ష సాధింపులకు దిగారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే బియ్యం స్మగ్లర్లు తమ ప్రత్యర్థులను ఇదే రీతిలో లారీతో కార్లను ఢీకొట్టిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి.

రాజకీయకోణంలోకి మారిన కేసు

బైరెడ్డిపల్లెలో మూడు దశాబ్దాల పాటు టీడీపీలో సీనియర్ నాయకుడిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సమకాలికుడుగా శ్రీనివాసులు రెడ్డి పార్టీలో వ్యవహరించారు. పలుదఫాలు అసెంబ్లీ టికెట్ రేసులోనూ ఉన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీలోనే స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా బోస్ వర్గానికి ఆయన దగ్గరయ్యారు. అదే గ్రామానికి చెందిన రఘుచంద్రగుప్తను అమరనాథరెడ్డి పెంచి పోషించారు. దీంతో వీరి మధ్య వైషమ్యాలు పెరిగి గ్రామంలో గొడవలు, కేసులు దాకా వెళ్లాయి. తాజా ఎన్నికల్లో శ్రీనివాసులు రెడ్డి మాజీ మంత్రి పెద్దిరెడ్డి సూచనతో వైఎస్సార్‌సీపీలో చేరారు. దీన్ని టీడీపీ శ్రేణులు ఏమాత్రం జీర్ణించుకోలేదు. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో శ్రీనివాసులు రెడ్డిపై ఎలాగైనా కక్ష సాధించాలనే ఆయన్ను ఈ కేసుల్లో ఇరికించారనే చర్చ కూడా స్థానికంగా బలంగా వినిపిస్తోంది. ఏదేమైనా ఈ కేసు పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు మాత్రం ఇది సుపారీతో జరిగిన హత్యాయత్నమేనంటూ తేల్చేయడం గమనార్హం.

మాన్యం భూముల్లో ఆక్రమణల తొలగింపు



మాన్యం భూముల్లో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు



గడువు ఇవ్వాలని అధికారులను కోరుతున్న బాధితులు

చౌడేపల్లె: మండలంలోని గోసలకురప్పల్లెలో వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూముల ఆక్రమణలను ఈఓ కమలాకర్ గ్రామస్తుల సహకారంతో కలిసి ఆదివారం తొలగింపు చర్యలు చేపట్టారు. మూడు రోజుల క్రితం ఆలయానికి చెందిన మాన్యం భూములను సాగుకు లీజుకిచ్చేందుకు వేలం పాట నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ సమయంలో సర్వేనెంబరు 156/4లో 11 ఎకరాల స్థలం ఉండగా, అందులో కొంత ఆక్రమణదారుల చెరలో ఉందని చెప్పారు. వారు ఆక్రమించుకున్న స్థలాలను స్వాధీనం చేసిన తరువాతనే వేలం నిర్వహించాలని పట్టుపట్టారు. దీంతో వేలం వాయిదా వేసిన అధికారులు ఆక్రమణలపై దృష్టి సారించారు. ఈ స్థలంలో ఇదివరకు 35 మంది లబ్ధిదారులు పక్కా గృహ నిర్మాణ పనులు చేపట్టడంతో 2014లో ట్రిబ్యునల్ కోర్టు గుంటూరులో కేసు నడుస్తోంది. అయితే వారందరూ వెనుక భాగంలో ఉన్న ఆలయ మాన్యంలో అక్రమ కట్టడాలను నిర్మించారు. కేసులో ఉన్న కొలతల కంటే ఎక్కువగా ఆక్రమించిన స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు వారంరోజులు గడువు ఇస్తే ఆక్రమణలు తొలగిస్తామని అధికారులకు విజ్ఞప్తి చేశారు.